# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు

9th HAPPY ANNIVERSARY

సంవత్సరాల ప్రయాణం

సంపుటి : 10 | సంచిక : 354 | పేజీలు : 4+8 | ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ : పి. గౌతమి | మంగళవారం 3 సెప్టెంబర్ 2024

Published form Medchal Malkajgiri, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda


## తెలుగు రాష్ట్రాల్లో రైల్వే వ్యవస్థ అస్తవ్యస్తం

### 432 రైళ్లు రద్దు..

### 139 దారి మళ్లింపు




హైదరాబాద్ పెన్ పవర్: తెలుగు రాష్ట్రాల్లో రైల్వే వ్యవస్థ అస్తవ్య స్తంగా తయారైంది. నాలుగు రోజు లుగా పడుతున్న కుండపోత వర్షాలకు కొన్ని చోట్ల రైల్వే ట్రాక్ కొట్టుకు పోయింది. కొన్ని చోట్ల రైలు పట్టాలపై నీళ్లు నిలిచాయి.. మరికొన్ని చోట్ల రైలు పట్టాలపై నీళ్లు ప్రవహిస్తున్నాయి. దీంతో


వివరాలు 2లో..




# ఎకరాకు రూ.10 వేలిస్తాం..

## వరద బాధితులను ఆదుకుంటాం

**ఇల్లు కూలిపోయన వారికి ఇందిరమ్మ ఇళ్కు .. వరదల్లో బురద రాజకీయాలు వద్దు**


- చనిపోయిన పశువులకు రూ. 50 వేలు
- జీవాలకు రూ. 5 వేల చొప్పున పరిహారం
- తెలంగాణ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ ఏర్పాటు చేస్తం
- తక్షణ సాయం కింద ఐదు వేల కోట్లు కావాలి
- ప్రధాని నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశాం
- కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి,
- బండి సంజయ్ చొరవ చూపాలి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి


వివరాలు 2లో..




హైదరాబాద్ పెన్ పవర్: భారీ వర్షాలు, వరదల కారణంగా నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ. 10 వేల చొప్పున పరిహారం అందిస్తామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ఇవాళ సూర్యాపేట జిల్లా మోతెలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎమ్మెల్యేలతో

## ఏపీ, తెలంగాణలను ఆదుకుంటాం




వివరాలు 2లో..


- తెలుగు రాష్ట్రాలను అతలాకుతలం చేస్తున్న భారీ వర్షాలు
- వాగులు, వంకలు, జనావాసాలు అనే తేడా లేకుండా మొత్తం జలమయం
- కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందన్న ప్రధాని

## నిండుకుండలా ప్రాజెక్టులు



**ప్రాజెక్టుల్లోని భారీగా వరదనీరు**

**గేట్లు ఓపెన్ చేస్తున్న ఆఫీసర్లు**

**అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ**


వివరాలు 2లో..


హైదరాబాద్ పెన్ పవర్: రాష్ట్రవ్యాప్తంగా రెండు రోజుల ఏకధాటి వర్షానికి ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతుంది. దీంతో రాష్ట్రంలోని అన్నీ ప్రాజెక్టులు నిండుకుండలా మారుతున్నాయి. ఆయా ప్రాజెక్టుల్లో గోదావరి పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆఫీసర్లు హెచ్చరికలు జారీ చేశారు. అధికారులు వరదనీటిని ప్రాజెక్టుల నుంచి గేట్లు ఓపెన్‌చేసి,

## వరద విలయం... రెండు రాష్ట్రాలకు విరాళం ప్రకటించిన వెంకయ్యనాయుడు



- జలవిలయంపై వెంకయ్యనాయుడు విచారం
- ఏపీ, తెలంగాణకు రూ. 5 లక్షల చొప్పున విరాళం
- సాయం చేయాలని మోదీకి ఫోన్ చేశానని వెల్లడి

హైదరాబాద్ పెన్ పవర్: ఏపీ, తెలంగాణ రాష్ట్రాలను భారీ వరదలు ముంచె త్తాయి. జల విలయంలో రెండు రాష్ట్రాలు విలవిల్లాడు తున్నాయి. ఈ వరదలపై మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు విచారం వ్యక్తం చేశారు. తనకు వచ్చే పెన్షన్ నుంచి రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సహాయనిధికి ఆయన విరాళం ప్రకటించారు. రూ. 5 లక్షల చొప్పున సహాయాన్ని ప్రకటించారు. ఆయన కుమారుడు, కూతురు కూడా రెండు రాష్ట్రాలకు


వివరాలు 2లో..




## ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త వరద సహాయక చర్యల్లో పాల్గొనాలి

- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వర్షాలు, వరదలపై స్పందించిన రాహుల్ గాంధీ
- నా ఆలోచనలు తెలుగు రాష్ట్రాల ప్రజలతో ఉన్నాయన్న రాహుల్ గాంధీ
- ఆత్మీయులను కోల్పోయిన కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపిన కాంగ్రెస్ నేత
- సహాయక చర్యల్లో పాల్గొనాలని కాంగ్రెస్ కార్యకర్తలకు పిలుపు


వివరాలు 2లో..


## కవితకు బెయిల్‌పై పోస్టులు... రేవంత్ రెడ్డికి సుప్రీంకోర్టు నోటీసులు

- కవితకు బెయిల్ రావడంపై కాంగ్రెస్ సోషల్ మీడియా పోస్టులు
- బెయిల్ వచ్చిందా? ఇచ్చారా? అంటూ పోస్టులు
- ఈ పోస్టులపై వివరణ ఇవ్వాలంటూ రేవంత్‌కు నోటీసులు

హైదరాబాద్ పెన్ పవర్: తెలంగాణ ముఖ్యమంత్రి, టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డికి సుప్రీంకోర్టు నోటీసు లు జారీ చేసింది. కవితకు బెయిల్ వచ్చిన సందర్భం గా కాంగ్రెస్ సోషల్ మీడి యా పోస్టులపై వివరణ ఇవ్వాలని


వివరాలు 2లో..




## తెలంగాణకు తప్పిన గండం

### మరో 5 రోజులు మోస్తరు వర్షాలు మాత్రమే

హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ రాష్ట్రానికి కొద్దిలో కొద్దిగా గుడ్ న్యూస్ చెప్పింది వాతావరణ శాఖ. బంగాళాఖాతంలోని వాయుగుండం పూర్తిగా బలహీ నపడు తుందని..



మరో 12 గంటల్లో అల్పపీడనంగా మారనుందని వెల్లడించింది హైదరాబాద్ వాతావరణ కేంద్రం. ఈ ప్రభావంతో.. తెలంగాణ రాష్ట్రంలో భారీ, అతి భారీ వర్షాలు పడవని వివరించింది.


వివరాలు 2లో..


## మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి తప్పిన పెను ప్రమాదం



హైదరాబాద్ పెన్ పవర్:ఖమ్మం జిల్లాను గత మూడు రోజులుగా కురు స్తోన్న భారీ వర్షాలు ముంచెత్తాయి. నాన్ స్టాప్‌గా వర్షం పడటంతో పాటు ఎగువ నుండి భారీగా వరద పొటెత్తడంతో ఖమ్మం జిల్లాలోని మున్నేరు వాగు ఉగ్రరూపం దాల్చింది. మున్నేరు వాగు పొంగిపొర్లడంతో


వివరాలు 2లో..


## ఇంట్లో వరద నీరు... చూస్తుంటే గుండె తరుక్కుపోతోంది

- వరద విలయతాండవం సృష్టించిందన్న హరీశ్ రావు
- ప్రభుత్వం కొంతకాలం కూల్చివేతలు, శుష్క రాజకీయాలు ఆపేయాలని హితవు
- బాధితులను ఆదుకోవడంపై దృష్టి సారించాలని హితవు



హైదరాబాద్ పెన్ పవర్:భారీ వర్షాల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సహాయక చర్యల కోసం ఎదురు చూస్తున్నారని మాజీ మంత్రి హరీశ్ రావు ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. "ఇంట్లో వరద నీరు... కంట్లో ఎడతెగని కన్నీరు... ఈ వరద సృష్టించిన విలయాన్ని చూస్తుంటే గుండె తరుక్కుపోతోంది" అంటూ హరీశ్ రావు ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. వర్షాలతో ప్రజలు ఇబ్బందిపడుతున్నందున... ప్రభుత్వం కొంతకాలం శుష్క రాజకీయాలు, కూల్చివేతలను ఆపేసి బాధితులను ఆదుకోవడంపై దృష్టి సారించాలని హితవు పలికారు. తక్షణ సహాయ చర్యలు అందడం లేదని ప్రజలు ఆవేదన చెందుతుండటంతో


వివరాలు 2లో..


## హైదరాబాద్ విమోచన దినోత్సవానికి ముఖ్య అతిథిగా అమిత్ షా

**ఈ నెల 17న హైదరాబాద్ విమోచన దినోత్సవం**

**అధికారికంగా నిర్వహిస్తున్న కేంద్ర ప్రభుత్వం**

**పరేడ్ మైదానంలో నిర్వహించనున్న విమోచన దినోత్సవం**

హైదరాబాద్ పెన్ పవర్: కేంద్రమంత్రి అమిత్ షా హైదరాబాద్ పర్యటన ఖరారైంది. ఈ నెల 17న హైదరాబాద్ విమోచన దినోత్సవంలో పాల్గొననున్నారు. కేంద్ర ప్రభుత్వం విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తోంది. 17వ తేదీన పరేడ్ మైదానంలో నిర్వహించనున్న కార్యక్రమానికి అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ కార్యక్రమం ఏర్పాట్లపై మంగళవారం పార్టీ నేతలతో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సమావేశం కానున్నారు.



## సంపాదకీయం

# హైడ్రా లాంటి సంస్థలతోనే విపత్తుకు విముక్తి

వానలు, వరదలు వచ్చి ఎక్కడికక్కడ మునిగిపోతున్నాయి. కారణం ఒక్కటే... నీటి పారుదల వ్యవస్థలు దెబ్బతినడమే. దాదాపు 25 లక్షల గృహాలున్న హైదరాబాద్ నగరంలో నిజాం కాలం నుండి కొన్ని వేల నీటి కుంటలు, చెరువులు, సరస్సులు, నాలాలు ఉండేవి. అనేక తోటలతో అందమైన నగరంగా విలసిల్లింది. కానీ వాటిలో 60-70 శాతం అక్రమంగా ఆక్రమించి పెద్ద భవనాలు, పరిశ్రమలు, నివాస గృహాలు, ఫామ్ హౌస్‌లు, అపార్ట్ మెంట్లు, ఫార్మా సిటీలు నిర్మించారు అక్రమదారులు..భాగ్యనగరంలో వర్షాకాలం వస్తే చాలు నీరు ఉప్పొంగి రోడ్లను, గృహ సముదాయాలను వరద ముంచెత్తుతోంది. దీంతో నీటి వనరుల పరిరక్షణే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం "హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఎసెట్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్" (హైడ్రా)ను ఏర్పాటు చేసింది. నిబంధనలను ఉల్లంఘించి, చట్ట వ్యతిరేకంగా అక్రమ నిర్మాణాలు చేపడితే తప్పకుండా వాటిని కూల్చి వేయవలసిందే. దీనికి సామాన్య ప్రజల నుండి హృదయ పూర్వకంగా అభినందనలు ప్రభుత్వానికి వస్తున్నాయి. హైదరాబాద్ భాగ్యనగరంగా ప్రసిద్ధి. నిజాం రాజ్యానికి రాజధాని. 500 సంవత్సరాల పైబడిన పురాతన చారిత్రక నగరం. ఈ నగరం ఇప్పుడు సురక్షిత, ఆవాసయోగ్యమైన, విశ్వనగరంగా విఖ్యాతి గాంచింది. ఈ మహానగరంలో ఒక్క తెలుగు వారే కాక దేశంలోని ఇతర ప్రాంతాల ప్రజలు ఉద్యోగ, ఉపాధి కోసం వచ్చి ఇక్కడ స్థిరపడ్డారు. చిరు వ్యాపారం చేసుకునే వారి సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. కోటికి పైగా జనాభా వున్న రాజధానిలో ఫ్లోటింగ్ పాపులేషన్ కూడా సుమారు 1 లక్షా 50 వేల మంది ఉంటారని ప్రభుత్వ అంచనా. వీరందరికి తగినంతగా తాగునీరు, ఇతర అవసరాలకు సరిపడా నీటి వసతి అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను, తర్వాత తెలంగాణను వరుసగా పాలించిన ప్రభుత్వాలు.. చెరువులపై అక్రమ నిర్మాణాలకు అలవోకగా అనుమతులిచ్చేశాయి. దీంతో వర్షాకాలంలో నీరు సహజంగా ప్రవహించి చెరువులలోకి చేరకుండా ఈ అక్రమ కట్టడాలు అడ్డుకుంటున్నాయి. దీంతో ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరుగుతుంది. ట్రాఫిక్ నిలిచిపోయి ప్రజా జీవితం దుర్భర మౌతుంది. నీటి వనరుల పరిరక్షణే ధ్యేయంగా ఏర్పరచిన హైడ్రా ఉద్దేశం చాలా మంచిది. నిబంధనలను ఉల్లంఘించి, చట్ట వ్యతిరేకంగా అక్రమ నిర్మాణాలు చేపడితే తప్పకుండా వాటిని కూల్చి వేయవలసిందే. అందుకే ప్రభుత్వానికి సామాన్య ప్రజల నుండి హృదయ పూర్వకంగా అభినందనలు వస్తున్నాయి. గతంలో హైకోర్టు, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులు కూడా సానుకూలంగా ఉన్నాయి. ప్రభుత్వ, ప్రజల ఆస్తుల పరిరక్షణ ప్రస్తుత, భవిష్యత్ తరాలకు ప్రకృతి వనరుల పరిరక్షణ అవసరం. అయితే హైడ్రా పనితీరుపై కొన్ని విమర్శలు వస్తున్నప్పటికీ హైడ్రా సృష్టిస్తున్న సంచలనం అంతా ఇంతా కాదు. అయితే ఈ ప్రక్రియ ఆరంభ శూరత్వం కాకూడదు. ఇకముందు అక్రమ కట్టడాలు లేకుండా ప్రభుత్వ ఆస్తులకు కంచెలు వేయాలి. సైన్ బోర్డులు తగిలించాలి. నిష్పాక్షికంగా, పారదర్శకంగా, రాజకీయ పార్టీలకు అతీతంగా హైడ్రా చట్టబద్ధంగా పనిచేయాలి. అది నిరూపించడం కోసం మొదట కాంగ్రెస్ నాయకుల ఆక్రమణలపై కూల్చివేతలు ప్రారంభించి, విపక్షాల అక్రమ కట్టడాల జోలికి వెళ్లాలి. ప్రభుత్వం తనవారు, పరాయివారు అనే పక్షపాతం ఎట్టి పరిస్థితుల్లో చూపరాదు. చెరువులు, కుంటలు, ఇతర సహజ వనరుల రక్షణ చేపట్టాలి. ధనికులకు, పారిశ్రామిక వేత్తలకు, సినీ సెలబ్రిటీలకు అనుచిత మర్యాదలు చూపి చట్ట వ్యతిరేక చర్యలకు మద్దతు ఇవ్వరాదు. రాగ ద్వేషాలకు, రాజకీయ కక్ష సాధింపులకు హైడ్రాను వాడరాదు. స్వపక్షం, విపక్ష హోదాలకు అతీతంగా హైడ్రా పనిచేయాలి. అయితే, ఇప్పటికే అక్రమ కట్టడాలలో ఇళ్లు కొనుక్కున్న వారికి బిల్డర్స్ ఆస్తులను జప్తు చేసి నష్టపరిహారం ఇవ్వాలి. పేదవారి ఇళ్లను కూల్చినప్పుడు వారికి వెంటనే ప్రభుత్వ భూమి ఇవ్వాలి. లేదా ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలి. లేదా తగిన నష్టపరిహారం వెంటనే చెల్లించాలి. బిల్డర్లతో కుమ్మక్కై ఇష్టారీతిన రిజిస్ట్రేషన్లు, లేఅవుట్ పర్మిషన్లు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలి. వారి ఆస్తులు జప్తు చేసి, జైలుకు పంపాలి. చెరువులపై కట్టిన కట్టడాలను కూల్చినప్పుడు కట్టడాల వ్యర్థాలను తీసివేసి చుట్టూ కంచె వేసి, పరిసర కాలనీ వాసులకు చెరువుల పరిరక్షణా బాధ్యతలను అప్పగించాలి. ప్రతి జిల్లాలోనూ హైడ్రా వంటి సంస్థలను ఏర్పాటు చేయాలి. చెరువులు, కుంటలు, నాలాలు చెక్ డ్యాముల పరిరక్షణకు, ప్రభుత్వ ఆస్తుల రక్షణకు ప్రజా సంఘాలను ఏర్పాటు చేసి వారికి బాధ్యత, అధికారాలు అప్పగించాలి. ప్రభుత్వ చిత్తశుద్ధే హైడ్రా విజయానికి ఆధారమవుతుంది.

# ఎకరాకు రూ.10 వేలిస్తాం..

- మొదటి పేజీ తరువాయి

కలిసి సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరద బాధిత రైతులను ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. వరదల్లో చనిపోయిన వారి కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ. 5 లక్షల చొప్పున పరిహారం ఇస్తామని చెప్పారు. చనిపోయిన పశువులకు రూ. 50 వేల చొప్పున, జీవాలకు రూ. 5 వేల చొప్పున పరిహారం అందిస్తామని వివరించారు. ప్రకృతి విపత్తులు ఎదురైనప్పుడు ప్రజలకు అండగా ఉంటూ వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు తెలంగాణ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ ను ఏర్పాటు చేయబోతున్నామని అన్నారు. విపత్కర పరిస్థితుల్లో ప రజలకు అండగా ఉంటూ సేవలందిస్తున్న అధికారులకు సీఎం అభినందనలు తెలిపారు. అధికారుల ముందు చూపు వల్ల ప్రాణనష్టం తక్కువగా ఉందని అన్నారు. ప్రధాని, కేంద్ర హోం మంత్రి రాష్ట్రంలోని వరదల పరిస్థితిపై తనతో ఫోన్ లో చర్చించారని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారని చెప్పారు. ఇండ్లు కూలిపోయిన వారికి ప్రధానమంత్ర అవాస్ యోజన కింద కొత్త ఇండ్లు నిర్మించి ఇస్తామని వివరించారు.

**విపత్కర పరిస్థితిలో రాజకీయాలు వద్దు**

విపత్కర పరిస్థితి లలో రాజకీయాలకు అతీతంగా కలిసి కట్టుగా పని చేద్దామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పదేండ్లు అధికారంలో ఉన్న వాళ్లు గతంలో వరదలు వచ్చినప్పుడెలా స్పందించారో అందరికీ తెలుసునని సీఎం అన్నారు. ప్రతిపక్ష నాయకులు ప్రభుత్వంపై బురద రాజకీయాలు మానుకోవాలని సూచించారు. ఇలాగే అబద్ధాలు చెబితే ప్రజలు వాళ్లకు నిజాలు చెప్పే సందర్భం వస్తుందని అన్నారు. బెయిల్ కోసం 20 మందితో ఢిల్లీ పోయేందుకు సమయం ఉంటుంది కానీ, వరదలతో ప్రజలు ఇబ్బంది పడుతుంటే ఆదుకునే సమయం ఉండదా..? అని సీఎం ప్రశ్నించారు.

**సీఎంఆర్ఎఫ్‌కు విరాళాలివ్వండి**

ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళాలు ఇవ్వాలని కార్పొరేట్ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలకు ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు సాయం అందించారని, అలాగే ముందుకు రావాలని కోరారు. ప్రభుత్వం నిబద్ధతో బాధ్యతాయుతంగా ప్రజలను అన్ని విధాలుగా ఆదుకునేందుకు సిద్ధంగా ఉందని చెప్పారు.

**100 మందితో టీజీడీఆర్ఎఫ్**

వరదలు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఎన్డీఆర్ఎఫ్‌పై ఆధారపడకుండా తెలంగాణలో 100 మంది సభ్యులకు తెలంగాణ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్(టీజీడీఆర్ఎఫ్)ను ఏర్పాటు చేయనున్నామని సీఎం చెప్పారు. 8 బృందాలు ఈ పనిలో ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చి ఒక వ్యవస్థనే తీసుకు రానున్నట్టు వెల్లడించారు.

**కేంద్ర మంత్రులు చొరవ చూపాలి**

రాష్ట్రంలో విపత్కర పరిస్థితులను పరిశీలించేందుకు రావాలని ప్రధానిని కోరినట్టు సీఎం చెప్పారు. రాష్ట్రానికి సాయం కింద రూ. 5 వేల కోట్లు కేటాయించాలని ప్రధానికి విజ్ఞప్తి చేశానని అన్నారు. తక్షణ సహాయ సాయం కింద రూ.2వేల కోట్లు విడుదల చేసే విధంగా కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కృషి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నామని ముఖ్యమంత్రి అన్నారు.

# తెలంగాణకు తప్పిన గండం

- మొదటి పేజీ తరువాయి

కాకపోతే రాబోయే ఐదు రోజులు అంటే.. సెప్టెంబర్ 6వ తేదీ వరకు మోస్తరు వర్షాలు పడతాయని స్పష్టం చేసింది వాతావరణ శాఖ. తూర్పు విదర్భను ఆనుకుని.. తెలంగాణ మీదుగా బలహీనపడిన వాయుగుండం కేంద్రీకృతం అయ్యి ఉందని.. ఇది సెప్టెంబర్ 2వ తేదీ నాటికి రామగుండంకు ఈశాన్యదిశగా 130 కిలోమీటర్ల దూరంలో ఉందని వివరించింది హైదరాబాద్ వాతావరణ కేంద్రం. ఈ ప్రభావంతో సెప్టెంబర్ 2వ తేదీ సోమవారం.. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మోస్తరు వర్షాలు పడతాయని తెలిపింది. %ూశ్రీంశీ =ఘుం%:-ప్రభుత్వం కీలక నిర్ణయం.. వరద మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా పెంపు

ఈ ప్రభావంతో రాబోయే 24 గంటలు అంటే.. సెప్టెంబర్ 3వ తేదీ మధ్యాహ్నం వరకు ఆదిలాబాద్, నిజామాబాద్, నిర్మల్, మెదక్, కామారెడ్డి, సంగారెడ్డి జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు పడతాయని వెల్లడించింది.

హైదరాబాద్

సిటీ, శివార్లలో మాత్రం మోస్తరు వర్షాలు పడతాయని వెల్లడించింది వాతావరణ కేంద్రం. మరో ఐదు రోజులు అంటే.. సెప్టెంబర్ 6వ తేదీ వరకు మోస్తరు వర్షాలు కురుస్తాయని.. అప్పటి వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది వెదర్ డిపార్ట్ మెంట్.

# వరద విలయం... రెండు రాష్ట్రాలకు విరాళం ప్రకటించిన వెంకయ్యనాయుడు

- మొదటి పేజీ తరువాయి

రూ. 2.5 లక్షల చొప్పున విరాళం ఇచ్చారు. ఈ మేరకు ఆయన ఈరోజు ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రధాని మోదీకి తాను ఫోన్ చేశానని... రెండు రాష్ట్రాల్లోని ప్రస్తుత పరిస్థితిని వివరించి, వెంటనే ఆదుకోవాలని కోరానని తెలిపారు. ఇరు రాష్ట్రాల అధికారులతో కేంద్ర అధికారులు టచ్ లో ఉన్నారని మోదీ తనకు చెప్పారని అన్నారు. ఇరు రాష్ట్రాలకు సాయం చేస్తామని ప్రధాని హామీ ఇచ్చారని చెప్పారు. ఇబ్బందుల్లో ఉన్న ప్రజలను ఆదుకోవడానికి స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు రావాలని పిలుపునిచ్చారు

# కవితకు బెయిల్‌పై పోస్టులు... రేవంత్ రెడ్డికి సుప్రీంకోర్టు నోటీసులు

- మొదటి పేజీ తరువాయి

నోటీసుల్లో పేర్కొంది. న్యాయవ్యవస్థ స్వతంత్రతను కాంగ్రెస్ ప్రశ్నిస్తోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు స్పందించింది. కవితకు సుప్రీంకోర్టు బెయిల్ ఇచ్చిన సందర్భంగా తెలంగాణ కాంగ్రెస్ సోషల్ మీడియా పోస్టులపై సుప్రీంకోర్టు వివరణ అడిగింది. కవిత బెయిల్ అంశంపై సోషల్ మీడియా పోస్టులను సీరియస్‌గా తీసుకుంది. కవితకు బెయిల్ వచ్చిందా? ఇచ్చారా? అంటూ తెలంగాణ కాంగ్రెస్ పోస్ట్ చేసింది. కమలంతో స్నేహం... కవితక్కకు మోక్షం అంటూ పేర్కొంది. తెలంగాణ కాంగ్రెస్ పోస్టులపై వివరణ ఇవ్వాలంటూ పీసీసీ చీఫ్‌గా ఉన్న రేవంత్‌కు ఆదేశాలు జారీ చేసింది. ఆయనకు రెండు వారాల గడువును ఇచ్చింది.

# ఇంట్లో వరద నీరు... చూస్తుంటే గుండె తరుక్కుపోతోంది

- మొదటి పేజీ తరువాయి

పాటు ఆగ్రహాన్ని కూడా వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం బాధ్యతాయుతంగా మనసుపెట్టి చర్యలు తీసుకోవాలని సూచించారు. బాధితులను అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాల్సిన చోట వేగంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆహారం, నీటిని అందుబాటులో ఉంచాలని సూచించారు. ఇప్పటికే తెలంగాణ రాష్ట్రం విషజ్వరాలతో విలవిల్లాడుతోందని, ఇప్పుడు వర్షాలు, వరదల వల్ల విజృంభించే అవకాశాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో అన్ని శాఖలు అప్రమత్తం కావాలని విజ్ఞప్తి చేశారు. పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలన్నారు. ప్రతి ఎకరాకు రూ.10 వేల నష్టపరిహారం ఇవ్వాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.

# తెలుగు రాష్ట్రాల్లో రైల్వే వ్యవస్థ అస్తవ్యస్తం 432 రైళ్లు రద్దు.. 139 దారి మళ్లింపు

- మొదటి పేజీ తరువాయి

తెలుగు రాష్ట్రాల్లో రైలు రాకపోకలు దాదాపు బంద్ అయ్యాయి. రెయిన్ ఎఫెక్ట్‌తో దక్షిణ మధ్య రైల్వే శాఖ ఇప్పటి వరకు ఏకంగా 432 రైలు సర్వీసులను రద్దు చేసింది. మరో 139 రైలు సర్వీసులను దారి మళ్లించి.. మరో 13 రైళ్లను పాక్షికంగా రద్దు చేసింది. భారీ వర్షాలు, వరదలు వల్ల కొన్ని ప్రాంతాలు రైల్వే ట్రాక్ కొట్టుకుపోవడంతో ప్రయాణికుల భద్రతా దృష్ట్యా రైళ్లను క్యాన్సిల్ చేసిటనట్లు తెలిపింది దక్షిణ మధ్య రైల్వే. ప్రమాదానికి గురైన రైల్వే ట్రాక్ మరమత్తు పనులు ఇంకా కొనసాగుతున్నాయని తెలిపింది. మహబూబ్‌బాద్ కేసముద్రం ట్రాక్‌లకు సంబంధించి పనులు సాగుతున్నాయని.. రేపు (మంగళవారం) సాయంత్రం వరకు ఈ రూట్‌లో ఒక ట్రాక్ పనులు పూర్తయ్యే అవకాశం ఉందని.. మరో రెండ్రోజుల్లో ఇంకో ట్రాక్ పనులు పూర్తయ్యే ఛాన్స్ ఉందని అధికారులు అంచనా వేశరు. సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్‌తో పాటు ఉన్నతాధికారులు పనులను అక్కడే ఉండి పనులను పర్యవేక్షిస్తున్నారు.

**రద్దయిన ముఖ్యమైన రైళ్ల వివరాలు:**

లింగంపల్లి - నర్సాపూర్, నాందేడ్ - విశాఖపట్టణం, కాచిగూడ-మిర్యాలగూడ, చెన్నయ్ సెంట్రల్ - చాప్రా, చెన్నయ్ - న్యూఢిల్లీ, సికింద్రాబాద్ - విజయవాడ, సికింద్రాబాద్ - గుంటూరు, లింగంపల్లి - కాకినాడ, మచిలీపట్నం - బీదర్,
బీదర్ - మచిలీపట్నం.

**దారి మళ్లించిన ముఖ్యమైన రైళ్లు:**

బొరక్ పూర్ - కోచివలి, అదిలాబాద్ - తిరుపతి, బనారస్ - కన్యాకుమారి, న్యూఢిల్లీ - తిరువనంతపురం, న్యూ ఢిల్లీ - చెన్నయ్, ఇండోర్ - కొచ్చివలి, బల్లర్షా - కాజీపేట - సికింద్రాబాద్ - గుంతకల్ - రేణిగుంట చేరుకుని రెగ్యులర్ రూట్ లో వెళతాయి..

# నిండుకుండలా ప్రాజెక్టులు

- మొదటి పేజీ తరువాయి

దిగువకు విడుదల చేస్తున్నారు.

సాగర్ నుంచి 5,06,248 క్యూసెక్కుల నీటి విడుదల

నాగార్జున సాగర్ ప్రాజెక్టు 26 క్రస్ట్ గేట్లు ఓపెన్ చేశారు. 26 గేట్లు ద్వారా 5,06,248 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. సాగర్ పూర్తి నీటి మట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం ప్రాజెక్టు 587.20 అడుగుల్లో ఉంది. పూర్తి నిల్వ సామర్థ్యం - 312.50 టీఎంసీలు ఉండగా.. ప్రస్తుత నీటి మట్టం- 305.62 టీఎంసీలు చేరింది. ఇన్ ఫ్లో - 5,33,157 క్యూసెక్కులు కాగా.. ఔట్ ఫ్లో - 5,41,435 క్యూసెక్కులుగా నమోదయింది.

**ఎస్సారెస్పీ 8 గేట్లు ఓపెన్**

ఉత్తర తెలంగాణ వరప్రదాయని ఎస్సారెస్పీ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో భారీగా పెరిగింది. దీంతో ప్రాజెక్టు 8 గేట్లను ఓపెన్ చేసి, గోదావరిలోకి నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టులో ఇన్ జేన్ ఫ్లో 1.96,767 క్యూసెల్కు లుండగా, ఔట్ ఫ్లో 34853 క్యూసెల్కులుగా నమోదయింది.

**కడెం ప్రాజెక్టు ఫుల్‌గేట్లు ఓపెన్**

కడెం ప్రాజెక్టు భారీగా వరదనీరు వచ్చి చేరుతుంది. దీంతో అధికారులు కడెం ప్రాజెక్టు మొత్తం 18 గేట్లను ఎత్తి, దిగువ గోదావరిలోకి నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు ఉండగా, ప్రస్తుతం నీటి నిల్వ 694.300 అడుగులకు చేరింది. ఇన్ ఫ్లో 194039 క్యూసెక్కులు కాగా, ఔట్ ఫ్లో 249054 క్యూసెక్కులకు చేరింది.

# మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి తప్పిన పెను ప్రమాదం

- మొదటి పేజీ తరువాయి

ఖమ్మంలోని పలు ప్రాంతాలు జలదిగ్బంధం అయ్యాయి. లో తట్టు ప్రాంతాలు జలమయం కాగా.. పలు కాలనీలు నీటమునిగాయి. వర్షాలు, వరదలకు ప్రజలు అల్లకల్లోలం అవుతుండటంతో మంత్రి పొంగులేటి వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి బాధితులతో మాట్లాడి ధైర్యం చెప్పారు.

రూరల్ మండలం మున్నేరు పరివాహక ప్రాంతంలోని నాయుడుపేట, జలగం నగర్, దానవాయిగూడెంలో వరద ఉధృతి కారణంగా నీట మునిగిన కాలనీల్లో పొంగులేటి శ్రీనివాసరెడ్డి బైక్‌పై తిరుగుతూ పర్యటించారు. ఈ క్రమంలో చిన్న అపశృతి చోటుచేసుకుంది. ప్రమాదవశాత్తు మంత్రి పొంగులేటి బైక్‌పై నుండి కింద పడగా గేర్ రాడ్ కాలికి గుచ్చుకోవడంతో స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే సిబ్బంది అప్రమత్తమై మంత్రికి చికిత్స అందించారు. మంత్రి పొంగులేటికి ఏమి కాకపోవడంతో అధికారులు, సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

# ఏపీ, తెలంగాణలను ఆదుకుంటాం

**పెన్ పవర్ డెస్క్:**గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలను అతలాకుతలం చేశాయి. వాగులు, వంకలు, నదులు అన్నీ ఏకమయ్యాయి. చాలా ప్రాంతాలలో చెరువులు, జనావాస ప్రాంతాలు అనే తేడా లేకుండా మొత్తం జలమయంగా మారింది. వరద విలయానికి ప్రజాజీవనం స్తంభించింది. విజయవాడ, గుంటూరు నగరాల్లో గత మూడున్నర దశాబ్దాల్లో ఎన్నడూ లేనంతగా బీభత్సమైన వర్షం కురిసింది. ఈ నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్ రెడ్డిలతో ప్రధాని మోదీ మాట్లాడారు. ఏపీ, తెలంగాణలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సాయం చేస్తుందని చెప్పారు. భారీ వర్షాల నేపథ్యంలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్ని కార్యక్రమాలను రద్దు చేసుకుని విజయవాడలోనే మకాం వేశారు. ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తూ అధికారులకు మార్గనిర్దేశం చూస్తున్నారు. మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులను క్షేత్ర స్థాయిలో పరుగులు పెట్టిస్తున్నారు. మరోవైపు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈరోజు ఖమ్మం జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించనున్నారు.

# ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త వరద సహాయక చర్యల్లో పాల్గొనాలి

**పెన్ పవర్ డెస్క్:**తెలుగు రాష్ట్రాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు, వరదలపై ఏఐసీసీ అగ్రనేత, లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఎక్స్ వేదికగా స్పందించారు. తన ఆలోచనలు అన్నీ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజలతోనే ఉన్నాయని పేర్కొన్నారు. వరదల వల్ల ఆత్మీయులను కోల్పోయిన కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సహాయక చర్యల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కూడా పాల్గొనాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితిని సమర్థవంతంగా ఎదుర్కోవడానికి, పునర్నిర్మాణ ప్రక్రియకు తెలంగాణ ప్రభుత్వం శక్తివంచన లేకుండా కృషి చేస్తోందని తెలిపారు. ప్రకృతి విపత్తు కారణంగా నష్టపోయిన వారందరికీ సమగ్ర పునరావాస ప్యాకేజీని సాధ్యమైనంత త్వరగా ప్రకటించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# నేటి నుండి భాద్రపద మాసం ప్రారంభం

## దేవతా పూజలకు, పితృదేవతల పూజకు కూడా ఉత్కృష్టమైన మాసం భాద్రపద మాసం

## చాంద్రమానం ప్రకారం భాద్రపద మాసం ఆరవమాసం

దేవతా పూజలకు, పితృదేవతల పూజకు కూడా ఉత్కృష్టమైన మాసం 'భాద్రపద మాసం'చాంద్రమానం ప్రకరం భాద్రపద మాసం ఆరవమాసం. ఈ మాసంలోని పూర్ణిమ తిథినాడు చంద్రుడు పూర్వాభాద్ర నక్షత్రం సమీపంలోగాని, ఉత్తరాభాద్ర నక్షత్రం సమీపంలోగానీ ఉండడంవల్ల ఈ మాసానికి 'భాద్రపద మాసం' అనే పేరు ఏర్పడింది.

ఈ మాసం లో ఒంటి పూట భోజనం చేస్తే ధన సమృద్ధి ఆరోగ్యం ప్రాప్తిస్తాయి. ఉప్పు మరియు బెల్లం దానాలు కూడా ఈ మాసం లో విశేష ఫలితాన్నిస్తాయి. కొన్ని ప్రదేశాలలో స్త్రీలు భాద్రపద శుక్ల తదియ రోజున హరితాళిక వ్రతం ఆచరిస్తారు. ఈ వ్రతాన్ని ఆచరించి, ఉపవాసం జాగరణ చేస్తారు. ఈ వ్రతాన్ని భక్తి శ్రద్దలతో ఆచరిస్తే కష్టాలు తొలగి, అష్టైశ్వర్యాలతో తులతూగుతారు.భాద్రపద శుద్ధ చవితి నాడు ఆది దేవుడైన వినాయక ఆవిర్భావం జరిగిన రోజు, ఈ రోజున గణపతి పూజ ఉపవాసం వంటివి విశేష ఫలితాన్నిస్తాయి. ఈ పండుగ ఆదివారం రోజు కాని, మంగళవారం రోజు కాని రావడం మరింత విశేషాన్ని సంతరించుకొంటుంది.భాద్రపద శుద్ధ పంచమి నాడు ఋషి పంచమి జరుపుకొంటారు. ఇది కేవలం ఆడవారికి సంబంధించిన ప్రాయోశ్చితాత్మకమైన వ్రతం. ఈ వ్రతం చేయడం వలన స్త్రీలు ఋతుస్రావ సమయం లో చేసిన పాపాలన్నీ తొలగి పుణ్య ఫలితం లభిస్తుంది అని భవిష్యపురాణం లో చెప్పబడింది. ఈ వ్రతం లో ముఖ్యంగా ఆచరించవలసినది, బ్రహ్మాహణుడికి అరటి పళ్ళు, నెయ్యి, పంచదార, దక్షిణ ఇవ్వాలి. ఒంటి పూట భోజనం చేయాలి. అంతే గాక ఆ భోజనం ధాన్యం, పాలు, పెరుగు, ఉప్పు, పంచాదారలతో తయారుచేయకుండా ఉండాలి. పళ్ళని స్వీకరించడం శ్రేయస్కరం.

బౌద్ధ జయంతి ని కూడా ఈ రోజునే జరుపుకొంటారు. బుద్దుని భోధనలు మానవుని ధర్మబద్ధమైన, పవిత్రమైన జీవనానికి వెలుగు బాట వేసాయి. ప్రపంచం లోని ధర్మమతస్తాపనకు బుద్దుడు అత్యున్నత స్థానం వహించాడనే విషయంలో ఏమాత్రం భేదాభిప్రాయాలు లేవు.భాద్రపద శుద్ద షష్ఠి /సూర్య షష్ఠి, సప్తమి కలసిన షష్ఠి సూర్యునికి ప్రీతికరం, ఈరోజున సూర్యుడిని ఆవుపాలు, పెరుగు, నెయ్యి, గోమయం, గోమూత్రం తో ప్రాశనం చేస్తే అశ్వమేధ యాగం చేసిన ఫలం కంటే ఎక్కువ ఫలం కలుగుతుందని శాస్త్రం లో చెప్పబడింది. షష్ఠి తో కూడిన సప్తమి ఉంటే కనుక సుబ్రహ్మణ్య స్వామి ని పూజిస్తే ఎటువంటి పాతకాలైన నశిస్తాయి.భాద్రపద శుద్ధ అష్టమి నాడు కేదారవ్రతాన్ని ఆచరిస్తారు. ఈ వ్రతాన్ని సంప్రదాయ సిద్ధం గా ఆచరిస్తుంటారు. భాద్రపద శుద్ధ దశమి నాడు దశావతార వ్రతం ఆచరించడం, దేవ, ఋషి, పితరులకు తర్పణాలు చేయడం ముఖ్యమైన విధులు. భాద్రపద శుద్ధ ఏకాదశి, దీన్నే పద్మ పరివర్తన ఏకాదశి అని కూడా అంటారు. తొలి ఏకాదశి రోజున పాల సముద్రం లో శేషతల్పం పై శయనించిన శ్రీమహావిష్ణువు, ఈ ఏకాదశి రోజున ప్రక్కకు పొర్లి పరివర్తనం చెందుతాడు, అందుకే దీన్ని పరివర్తన ఏకాదశి అంటారు ఈ ఏకాదశి వ్రతాన్ని ఆచరిస్తే కరువు కాటకాలు తొలగి పోతాయి, ముఖ్యం గా సంధ్యాసమయం లో శ్రీ మహా విష్ణువు ని పూజిస్తే మంచి ఫలితాలు కలుగుతాయి.

భాద్రపద శుద్ధ ద్వాదశి వామన జయంతి గా చెప్పబడింది, ఈ రోజున వామనున్ని ఆరాదిస్తే అన్ని విషయాలలోనూ విజయం లభిస్తుంది. ముఖ్యంగా ఈ రోజున బ్రాహ్మణులకు పెరుగును దానం చేస్తే మంచి ఫలితాలని పొందవచ్చు.భాద్రపద మాసం లో శుద్ద చతుర్దశి నాడు అనంత పద్మనాభ చతుర్దశి అంటారు. శేషతల్పసాయిగా నాభికమలం తో శ్రీమహాలక్ష్మి సమేతుడైన శ్రీమహావిష్ణువు ని పూజించి, వ్రతమాచరిస్తే దారిద్ర భాధలు తొలగి ఐశ్వర్య ప్రాప్తి కలుగుతుంది.భాద్రపద పూర్ణిమ రోజు ఉమామహేశ్వర వ్రతం జరుపుకొంటారు, భక్తి శ్రద్దలతో ఈ వ్రతాన్ని ఆచరిస్తే సుఖశాంతులతో పాటు అష్టైశ్వర్యాలు ప్రాప్తిస్తాయి.భాద్రపద పూర్ణిమ తో మహాలయపక్షం ఆరంభమవుతుంది, అమావాస్య వరకు గల ఈ కాలాన్ని పితృ పక్షం అని కూడా అంటారు. మృతులైన పితరులకు, పూర్వీకులకు తప్పనిసరిగా తర్పణలివ్వాలి. శ్రాద్దాన్ని యధాశక్తి గా ఈ దినాలలో చేయాలి.

భాద్రపద బహుళ తదియ ని ఉండ్రాళ్ళ తద్దేగా చెప్పబడింది. ఇది స్త్రీలు చేసుకొనే పండుగ, ముఖ్యంగా కన్నె పిల్లలు గౌరీ దేవిని పూజించి, ఉండ్రాళ్ళను నివేదిస్తే మంచి భర్త వస్తాడని చెప్పబడింది. స్త్రీలకు అయిదవతనం వృద్ధి చెందుతుంది.భాద్రపద కృష్ణ ఏకాదశి అజ ఏకాదశి దీన్ని ధర్మప్రభ ఏకాదశి అని కూడా అంటారు. ఈ రోజు ఏకాదశి వ్రతమాచరించి నూనె గింజలను దానం చేస్తే విశేష ఫలితాన్ని పొందవచ్చు.భాద్రపద కృష్ణ అమావాస్య మహాలయమావాస్య, ఈ రోజున పితృ తర్పణాలు, దానధర్మాలు చేయడం ఆచారం.

# 7న మద్యం షాపుల బంద్

**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్ నెల్లూరు, సెప్టెంబర్ 2 :** ఏపీలో త్వరలోనే కొత్త మద్యం పాలసీ తెరపైకి రానుంది. గత ప్రభుత్వం మద్యం అమ్మకాల విషయంలో అడ్డగోలుగా వ్యవహరించిందని డిజిటల్ పిమెంట్స్ కు అనుమతి ఇవ్వకుండా కేవలం డైరెక్ట్ క్యాష్ తీసుకుంటూ కోట్ల రూపాయలను పక్కదారి పట్టించారు అని కూటమి ప్రభుత్వం మొదటి నుంచీ ఆరోపిస్తోంది. సొంత మద్యం బ్రాండ్లతో అటు ప్రజల ఆరోగ్యం ఇటు ప్రభుత్వ ఖజానా రెండింటికీ దెబ్బకొట్టారు అని ఎన్నికల సమయంలో తీవ్రంగా ప్రచారం చేశారు. నిజానికి నాటి వైసీపీ ప్రభుత్వం ఎన్నికలకు కాస్త ముందుగా మాత్రమే మద్యం దుకాణాల్లో డిజిటల్ పెమెంట్ లకు అనుమతి ఇచ్చింది. ఇవన్నీ నాటి పాలనపై అనుమానాలు సృష్టించింది అనేది స్పష్టం.ఏపీలో అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబు ప్రకటించిన వైట్ పేపర్స్ లో మద్యం పాలసీ కూడా ఒకటి. ఏకంగా అసెంబ్లీలోనే శ్వేత పత్రాన్ని రిలీజ్ చేసిన చంద్రబాబు గత వైసీపీ పాలనలో మద్యం టెండర్లలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయన్నారు. దేశ వ్యాప్తంగా మద్యం వినియోగం పెరిగిన వేళ పక్క రాష్ట్రాల్లో ఆదాయం పెరిగితే ఏపీలో మాత్రం తగ్గింది అన్నారు. అప్పటి పాలకులు ఏపీ ఖజానాకు రావల్సిన ఆదాయాన్ని సైడ్ ట్రాక్ పట్టించడం వల్లే ఈ పరిస్థితి అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారుప్రస్తుతం ఏపీలో మద్యం పాలసీ ఎలా ఉండాలి అనేదానిపై అధ్యయనం చేయడానికి మంత్రులతో ఒక సబ్ కమిటీ ఏర్పాటు చేశారు ముఖ్యమంత్రి. ఆ కమిటీలో సభ్యులుగా మంత్రులు కొల్లు రవీంద్ర, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్, గొట్టిపాటి రవి, కొండపల్లి శ్రీనివాస్ ఉన్నారు. వీరు పక్క రాష్ట్రాలు ముఖ్యంగా తెలంగాణలో అమలవుతున్న మద్యం పాలసీలను పరిశీలించి దానికి అనుగుణంగా కొత్త పాలసీకి తగిన సూచనలను ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతారు. అనంతరం అక్టోబర్ 1 న ఏపీలో కొత్త మద్యం పాలసీని సీఎం ప్రకటిస్తారు.కొత్త మద్యం పాలసీలో ప్రభుత్వ మద్యం దుకాణాలు మూసేసి ప్రైవేటుపరం చేస్తారు అనేది ఇప్పుడు ఏపీలో హాట్ టాపిక్ గా మారింది. దానితో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ఇప్పుడు రోడ్డెక్కారు. ముందు తమ ఉద్యోగాల సంగతి తేల్చాలని వారు డిమాండ్ చేస్తున్నారు. గత వైసిపి ప్రభుత్వం పేపర్ నోటిఫికేషన్ ఇచ్చి డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ ద్వారా తమ ఉద్యోగాల ప్రక్రియ పూర్తి చేశారని కానీ ఐదేళ్లుగా పని చేస్తున్న తమకు సరైన సమయానికి జీతాలు ఇవ్వలేదని వారు అంటున్నారు. పైగా తమకు రావల్సిన ఖఈ,ాు,ఇూఎల డబ్బును కూడా ఏజెన్సీలు తినేసాయని ఆరోపిస్తున్నారు. కొత్త ప్రభుత్వంలో తమకు న్యాయం జరుగుతుంది అనుకుంటే ఇలా అర్ధాంతరంగా తమను రోడ్డున పడేశారని వాపోతున్నారు. అందుకే కొత్త మద్యం పాలసీ ప్రకటించేలోపు తమ ఉద్యోగాలపై స్పష్టమైన ప్రకటన చెయ్యాలని డిమాండ్ చేస్తున్నారు. ఆ కోణంలోనే సెప్టెంబర్ 4 నుంచి నిరసనలు చేస్తామని సెప్టెంబర్ 7న రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ మద్యం దుకాణాల బంద్ చేపడతామని ఏపీ బేవరేజేస్ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రకటించింది. ప్రస్తుతం ఏపీలోని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో 18వేల మంది వరకూ పనిచేస్తున్నారు. అన్నివేల కుటుంబాలను ఒక్కసారిగా రోడ్డున పడేయకండి అంటూ వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.




# 2005 తర్వాత... బెజవాడ మునిగింది

**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్ విజయవాడ సెప్టెంబర్ 2:**సరిగ్గా 20ఏళ్ల తర్వాత విజయవాడ నగరం ముంపుకు గురైంది. వాగులు, వంకలు ఆక్రమణకు గురైతే ప్రకృతి కన్నెర చేస్తుందని మరోసారి రుజువైంది. 20ఏళ్ల క్రితం చేపట్టిన ఆపరేషన్ కొల్లేరు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో దానికి మూల్యం చెల్లించుకుంటున్నారు. 20ఏళ్లలో విజయవాడ నగరం ఊహించని వేగంగా విస్తరించడం, బుడమేరు ప్రవాహ మార్గాన్ని కబ్జా చేయడమే ప్రస్తుత పరిస్థితికికారణమైంది.విజయవాడ నగరానికి పక్కగా ప్రవహించే కృష్ణానదికంటే నగరం మధ్యలో ప్రవహించే బుడమేరుతో దశాబ్దాలుగా దానికి ముప్పు పొంచి ఉంది.2005లో చివరి సారి బుడమేరు బెజవాడ పుట్టిముంచింది. 2005సెప్టెంబర్లో వచ్చిన భారీ వర్షాలతో నగరం అతలాకుతలమైంది. విజయవాడ మూడొంతులు ముంపుకు గురైంది. వరదల కారణంగా విజయవాడలో కార్పొరేషన్ ఎన్నికలు సైతం వాయిదా పడ్డాయి. దీనికి ప్రధాన కారణం బుడమేరు ఉగ్రరూపంతో ప్రవహించడమే. రికార్డు స్థాయిలో ఎగువున ఖమ్మం జిల్లా నుంచి వరద ప్రవాహం పోటెత్తడంతో అదంతా విజయవాడను ముంచెత్తింది.ఖమ్మం జిల్లాలో పుట్టే బుడమేరు ఏటా సాధారణ సీజన్లో గరిష్టంగా 11వేల క్యూసెక్కుల ప్రవాహంతో ప్రవహిస్తుంది. 2005లో అది 70వేల క్యూసెక్కులకు చేరింది. బుడమేరు ప్రవాహాన్నినియంత్రించడానికి వెలగలేరు వద్ద ఓ రెగ్యులేటర్ను కూడా 70వ దశకంలో నిర్మించారు. వెలగలేరు మీదుగా ఇబ్రహీంపట్నం, గొల్లపూడి, విజయవాడ రూరల్ మీదుగా నగరంలోకి ఇది ప్రవేశిస్తోంది.2005లో వచ్చిన వరదలకు కారణాలను వివరిస్తూ సీపీఐ అనుబంధ రైతు సంఘం నాయకుడు కొల్లి నాగేశ్వరరావు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. బుడమేరు ముంపుకు శాశ్వత పరిష్కారం చూపకపోతే కృష్ణా జిల్లాకు ఎప్పటికీ ముంపు పొంచి ఉంటుందని ఆందోళనకు దిగడంతో ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి స్వయంగా విజయవాడ వచ్చారు. విజయవాడలో ఉన్న వరద పరిస్థితి మొత్తాన్ని ఇరిగేషన్ అధికారులు సీఎంకు వివరించారు. బుడమేరు ప్రవాహాన్ని కట్టడి చేయాలంటే దానిని మళ్లించడం ఒక్కటే మార్గమని భావించారు.పోలవరం ప్రాజెక్టులో భాగంగా గోదావరి జలాలను కుడి కాల్వ ద్వారా కృష్ణా నదిలో కలిపే డిజైన్ అప్పటికే ఖరారైంది. బుడమేరు ప్రవాహానికి దిగువన పోలవరం కుడికాల్వ కృష్ణానదిలో గుర్తించి అలైన్మెంట్లో మార్పులు చేయాలని అధికారులకు నాటి సీఎం వైఎస్సార్ సూచించారు. విజయవాడ ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు బుడమేరు మలుపులు సరి చేసి నీటి ప్రవాహం నేరుగా కొల్లేరుకు చేరేలా



చూస్తామని, వరదల్లో నీటి ప్రవాహం వెనక్కి ఎగదన్నకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.పోలవరం కుడి కాల్వ నిర్మాణంలో భాగంగా 2007-08 నాటికి బుడమేరు దిగువ ప్రవాహాన్ని కుడి కాల్వలోకి మళ్లించారు. కొత్తగా మరో కాల్వను తవ్వకుండా విజయవాడ థర్మల్ పవర్ స్టేషన్ నుంచి వచ్చే జలాలను కృష్ణా నదిలో కలిపే కాల్వలోకి మళ్ళించారు.ఇక్కడే సాంకేతికంగా ఓ సమస్య తలెత్తింది. పోలవరం కుడి కాల్వను గరిష్టంగా 37,500 క్యూసెక్కుల ప్రవాహం ఉండేలా డిజైన్ చేశారు.విటిపిఎస్ మీదుగా ప్రవహించే కాల్వలకు అంత సామర్థ్యం లేదు. వాటిని వరద ప్రవాహానికి అనుగుణంగా పెంచాలని ప్రతిపాదనలు ఉన్నా, థర్మల్ పవర్ ప్రాజెక్ట్ లోపల కాల్వలను విస్తరించే పరిస్థితి లేకపోవడంతో బుడమేరు వరద ప్రవాహానికి అనుగుణంగా కాల్వల సామర్థ్యం పెరగలేదనే వాదన ఉంది. దీనికి తోడు కృష్ణానది ముఖ ద్వారంలో ఉన్న నిర్మాణాలు కూడా వరద ప్రవాహాన్ని నిరోధిస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి.విటిపిఎస్ నుంచి కృష్ణా నదిలోకి బుడమేరు వరద నీరు చేరాలంటే కృష్ణానదిలో నీటి మట్టం తగిన స్థాయిలోఉండాలి. కృష్ణా నదిలో ఎగువ నుంచి వరద కొనసాగే సమయంలో బుడమేరు నుంచి వచ్చే వరద ప్రవాహం నదిలోకి చేరదు. అదే సమయంలో పోలవరం కుడి కాల్వ నుంచి నీటి విడుదల కొనసాగితే వరద ప్రవాహం దిగువన విజయవాడ వైపే వెళ్లాల్సి ఉంటుంది.20ఏళ్ల క్రితం వచ్చిన వరదల్లో విజయవాడ నగరంలో న్యూ రాజరాజేశ్వరి పేట, సింగ్నగర్, పాయకాపురం, కండ్రిక ప్రాంతాలు ముంపుకు గురయ్యాయి. రోజుల తరబడి ప్రజలు వర్షపు నీటిలో చిక్కుకుపోయారు. బుడమేరుకు వెలగలేరు రెగ్యులేటర్ దిగువన మళ్లింపు చేపట్టగానే విజయవాడకు వరద ముంపు తప్పిపోయింది.2008 నుంచి విజయవాడ రూరల్ మండలంలో వేగంగా నిర్మాణాలు విస్తరించాయి. రాష్ట్ర విభజన తర్వాత ఏకంగా నగరంలో మరో కొత్త ప్రాంతాలు ఏర్పడ్డాయి. విజయవాడ సెంట్రల్ నియోజక వర్గం పరిధిలో న్యూ రాజరాజేశ్వరిపేట ఎక్స్టెన్షన్, నందమూరి నగర్ వంటి ప్రాంతాలు విస్తరించాయి. అంతకు ముందు అదంతా బుడమేరు పరివాహక ప్రాంతమనే సంగతిని పూర్తిగా విస్మరించారు.2005లో చేపట్టిన బుడమేరు డైవర్షన్ పనులు పూర్తిగా అటకెక్కిన సంగతి కూడా ప్రజా ప్రతినిధులు విస్మరించారు. బుడమేరు ప్రవాహం విజయవాడ నగరంలోకి రాకుండా ఏర్పాటు చేసిన కరకట్టను 2008 నుంచి పూర్తిగా ధ్వంసం చేసి ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ఈ కరకట్ట ఇప్పుడు ఆనవాళ్లు కూడా లేకుండా పోయింది. సుందరీకరణ పేరుతో నగరానికి రక్షణగా ఏర్పాటు చేసిన వ్యవస్థల్ని రాజకీయ నాయకులు యథేచ్ఛగా ధ్వంసం చేశారు. కాలనీలకు కాలనీలను విస్తరించి నివాస ప్రాంతాలను విస్తరించడంలో 2009 నుంచి విజయవాడలో ఎన్నికైన ఎమ్మెల్యేలు కీలక పాత్ర పోషించారు. కాంగ్రెస్, టీడీపీ, వైసీపీలకు ఇందులో భాగస్వామ్యం ఉంది.బుడమేరు ఉగ్రరూపం దాల్చినపుడు నీటి ప్రవాహానికి అనుగుణంగా పలు చోట్ల మలుపులు ఏర్పడ్డాయి. రెండు, మూడు దశాబ్దాల క్రితం నాలుగైదేళ్ల క్రితం బుడమేరుకు వరదలు వచ్చినా పంట పొలాలు మాత్రమే నీట మునిగేవి. బుడమేరు ప్రవాహంలో ఉన్న మలుపులు నీటి సహజ ప్రవాహ వేగాన్ని తగ్గించి ఊళ్లను ముంచెత్తుతున్నాయని, విజయవాడ, నిడమానూరు ప్రాంతాల్లో ఉన్న "యూ " టర్నింగ్లను సవరించాలని 20ఏళ్ల క్రితమే ఇరిగేషన్ శాఖ ప్రతిపాదించింది.బుడమేరును ఆక్రమణల నుంచి విడిపించి దాని గరిష్ట సామర్థ్యానికి అనుగుణంగా విస్తరించాలని ప్రతిపాదించారు. విజయవాడ మార్కు రాజకీయం ఆ పనుల్ని అడ్డుకుంది. ఇళ్లను తొలగిస్తే ఊరుకోమని హెచ్చరించడంతో ప్రభుత్వం కూడా వదిలేసింది. ఇదే అదనుగా బుడమేరును యథేచ్ఛగా ఆక్రమించేశారు. ఇక విటిపిఎస్ నుంచి ప్రవహించే వరద ప్రవాహ మార్గంలో ఉన్న నిర్మాణాలు కూడా విజయవాడ ముంపుకు కారణమవుతున్నాయి. వాటిని సరిచేసే సంకల్పం ఏ పార్టీకి లేకపోవడమే ప్రస్తుత పరిస్థితి కారణమైంది.ప్రపంచంలోనే అతిపెద్ద మంచి నీటి సరస్సుకు నీటిని అందించే నీటి వనరుల్లో బుడమేరు ఒకటి, పశ్చిమగోదావరిలో తమ్మిలేరు, ఎర్రకాల్వలతో పాటు కృష్ణాలో బుడమేరు కొల్లేరుకు ప్రధాన నీటి వనరుగా ఉంటుంది. కొల్లేరులో వరద ప్రవాహాన్ని స్వీకరించకుండా ఆక్రమణలతో నిండిపోవడంతో వరదలు దిగువకు చేరడంలో జాప్యం జరుగుతోంది. ఖమ్మం, ఉమ్మడి కృష్ణా జిల్లాల్లో ప్రవహించే వర్షపు నీరంతా బుడమేరు ద్వారా 170కిలోమీటర్లకు పైగా దూరం ప్రయాణించి కొల్లేరును చేరుతుంది.



## రాజ్యసభలోకి టీడీపీ రీ ఎంట్రీ - రాజీనామా చేసిన వాళ్లకే చానిస్తారా




**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్ విజయవాడ, సెప్టెంబర్ 2 :** తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాత రాజ్యసభలో ప్రాతినిధ్యం లేకుండా ఎప్పుడూ లేదు. గత ఏప్రిల్లో చివరిగా కనకమేడల రవీంద్రకుమార్ పదవి కాలం ముగియడంతో రాజ్యసభలో టీడీపీకి సభ్యులు లేకుండా పోయారు. ఏపీకి ఉన్న మొత్తం పదకొండు మంది రాజ్యసభ సభ్యులు వైసీపీ వాళ్లే ఉన్నారు. మళ్లీ 2026లోనే నాలుగు స్థానాలు ఖాళీ కావాల్సి ఉంది. అప్పుడు జరిగే ఎన్నికల్లో నాలుగు టీడీపీ కూటమికే దక్కుతాయి. కానీ అప్పటి వరకూ ఆగాల్సిన అవసరం లేకుండా ఇద్దరు రాజ్యసభ సభ్యులు రాజీనామా చేశారు. వారిలో ఒకరు టీడీపీలో చేరిపోతానని ప్రకటించారు. మరొకరు ఏ పార్టీ అన్నదానిపై స్పష్టత ఇవ్వలేదు. కానీ ఇద్దరి రాజీనామాలు ఆమోదించడంతో ఖాళీ అయినట్లుగా ప్రకటించారు. రాజ్యసభలో రెండు స్థానాలు ఖాళీ అయినట్లుగా ప్రకటించారు. త్వరలోనే ఉపఎన్నికలు జరగనున్నాయి. ఈ ఉపఎన్నికల్లో రెండు చోట్ల టీడీపీ కూటమికి ఏకగ్రీవం అవుతాయి. రాజీనామా చేసిన మోపిదేవి వెంకట రమణా రావు టీడీపీలో చేరుతానని ప్రకటించారు. మరో ఎంపీ బీద మస్తాన్ రావు మాత్రం ఇంకా స్పష్టత ఇవ్వలేదు. ఆయన మొదటి నుంచి టీడీపీ నేత. 2019లో నెల్లూరు టీడీపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేశారు కూడా. తర్వాత వైసీపీలో చేరడంతో రాజ్యసభ సీటు దక్కింది. ఇప్పుడు ఆ పదవికి రాజీనామా చేశారు. అయితే టీడీపీలో చేరికపై స్పష్టత ఇవ్వలేదు. రే?పల్లెకు చెందిన మోపిదేవి వెంకటరమణారావు స్థానిక రాజకీయాల్లో ఉండాలనుకుంటున్నారు. తనకు రాజ్యసభ సభ్యత్వం ఇష్టం లేదని ఆయన అంటున్నారు. ఆ ప్రకారం చూస్తే ఆయన రాజ్యసభ పదవిని కూడా వదులుకున్నట్లే. ఈ పదవిని టీడీపీ అధినేత చంద్రబాబు మరో సీనియర్ నేతకు కేటాయించే అవకాశం ఉంది. అశోక్ గజపతిరాజు లేదా యనమల రామకృష్ణుడుకు కేటాయించే అవకాశం ఉంది. అయితే ఈ పదవి పదవీ కాలం మరో రెండేళ్లు కూడా లేదు. ఇప్పుడు పదవి దక్కించుకునేవారే అప్పుడు కూడా కంటిన్యూటీ పొందే అవకాశం ఉంది. బీద మస్తాన్ రావు బీజేపీలో చేరితే ఆ పార్టీ తరపున రాజ్యసభకు ఎంపికయ్యే అవకాశం ఉంది. ఆయన పదవి కాలం 2028 వరకూ ఉంది. ఆ ఒప్పందంతోనే ఆయన వైసీపీకి.. రాజ్యసభకు రాజీనామా చేసి ఉంటారని భావిస్తున్నారు. అయితే ఖాళీ అయిన రెండు సీట్లలో రెండూ టీడీపీ పోటీ చేస్తుందా.. ఒకటి బీజేపీకి కేటాయిస్తుందా అన్నదానిపై స్పష్టత రావాల్సి లఉంది. అందుకే ఆయన ఏ పార్టీలో చేరేది చెప్పలేదన్న అభిప్రాయం వినిపిస్తోంది. మొత్తంగా టీడీపీకి మళ్లీ రాజ్యసభలో ప్రాతినిధ్యం.. ఐదు నెలల వ్యవధిలోనే లభించబోతోంది.

## ప్రతి 15 రోజులకొక డామేజ్



**స్టేట్ బ్యూరో పెన్ పవర్ విజయవాడ, సెప్టెంబర్ 2 :**వైసీపీకి భారీ డ్యామేజ్ జరుగుతోందా? ఆ పార్టీ నైతికత దెబ్బతింటోందా? అది చేజేతులా హై కమాండ్ చేసుకున్న నష్టమా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక పద్ధతి ప్రకారం వైసిపి నైతికత దెబ్బతినేలా ప్రచారం జరుగుతోంది. ప్రతిపక్షం రోజులకు ఒక వీడియో బయటకు వస్తోంది. తొలుత విజయసాయిరెడ్డి ఎపిసోడ్ నడిచింది. దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ భర్త తెరపైకి వచ్చారు. తన భార్య కడుపులో పెరుగుతున్న బిడ్డకు తండ్రి ఎవరో చెప్పాలని డిమాండ్ చేశారు. విజయసాయి రెడ్డి పై అనుమానం వ్యక్తం చేశారు. డీఎన్ఏ టెస్ట్ కు డిమాండ్ చేశారు. కానీ ఎందుకో ఆయన అనుమానాలను నివృత్తి చేసేలా.. వైసీపీ నుంచి ఎటువంటి సమాధానం లేదు. కానీ ఇష్యూను డైవర్ట్ చేసి సైలెంట్ అయ్యారు. అటు తరువాత ఎమ్మెల్సీ దువ్వాడ ఫ్యామిలీ వ్యవహారం బయటపడింది. కుటుంబ కథ అనుకున్నా.. ఇంతటి విభాగానికి ఓ మహిళ కారణమని బయటపడింది. దాదాపు పక్షం రోజులు రచ్చ నడిచింది. ఇప్పటికీ ఫుల్ స్టాప్ పడడం లేదు. ఇంతలోనే ఎమ్మెల్సీ అనంత బాబు అసభ్య వీడియో బయటకు వచ్చింది. అది మార్ఫింగ్ చేసిన వీడియో అంటూ చెబుతున్నా.. బాధితులే స్వయంగా బయట పెట్టడంతో వైసిపికి ఇబ్బందికరంగా మారింది. అయితే ఇలా మొత్తం ఎపిసోడ్లలో వైసిపి నైతికత దెబ్బతింది.వైసిపి అధికారంలో ఉన్నప్పుడు ఇటువంటివి జరిగాయి. కానీ అధికారంలో ఉండడంతో అన్ని కొట్టుకెళ్ళాయి. కానీ ఇప్పుడు విపక్షానికి వచ్చేసరికి సీన్ సితార్ అవుతోంది. ప్రజాక్షేత్రంలో ఉన్నవారు చాలా జాగ్రత్తగా ఉండాలి. మాంసం తిన్నామని ఎముకలు మెడకు కట్టుకుంటే ఎలా ఉంటుందో.. వైసిపి చర్యలు అలానే ఉండేది. కానీ ప్రతిపక్షంలో వచ్చేసరికి అవన్నీ వికటించాయి. వైసీపీ నైతికతను ప్రశ్నించే పరిస్థితికి దాపురించాయి.వైసీపీలోని మాజీ మంత్రుల్లో ఒకరు అరగంట అన్నారు. మరొకరు గంట చాలని అన్నారు. అయితే ఇలా అన్నది మహిళలతో. ఆ ఆడియోలు అప్పట్లో బయటకు వచ్చాయి. పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. కానీ నాడు వైసిపి హై కమాండ్ స్పందించలేదు. కనీసం ఖండించలేదు కూడా. దీంతో వైసీపీలో ఇదో అలవాటైన అంశంగా మారిపోయింది. అటు తరువాత ఓ ఎంపీ అసభ్య వీడియో ఒకటి వెలుగులోకి వచ్చింది. అప్పుడు కూడా వైసిపి హై కమాండ్ ఎటువంటి చర్యలకు ఉపక్రమించలేదు.ప్రజాక్షేత్రంలో ఉన్న పార్టీలో నేతలు తప్పు చేస్తే ఆ ప్రభావం పార్టీపై చూపడం ఖాయం. అయితే ఈ విషయంలో వైసీపీ హై కమాండ్ నిర్లక్ష్యంగా వ్యవహరిం చింది. నేతల వివాదాస్పద వ్యవహార శైలి బయటపడినా.. పెద్దగా స్పందించలేదు. నేతలపై చర్యలకు ఉపక్రమించలేదు. అందుకే ఇప్పుడు పార్టీ నైతికత దెబ్బతీసేలా నెలకు ఒక వివాదాస్పద అంశాన్ని తెరపైకి తెచ్చే ప్రయత్నం జరుగుతుంది. తొలుత విజయసాయిరెడ్డి, తరువాత ఎమ్మెల్సీ దువ్వాడ, నిన్న ఎమ్మెల్సీ అనంతబాబు, ఈరోజు ముంబై నటి వ్యవహారం వైసిపి మెడకు చుట్టుకుంది. ఆ పార్టీ నైతికతను దెబ్బతీసేలా ఉంది.

## హద్దు మీరుతున్న సొంత పార్టీ నేతలు



**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్ తిరుపతి సెప్టెంబర్ 2 :**
ఏపీ సీఎం చంద్రబాబు పార్టీ ఎమ్మెల్యేలకు కీలక ఆదేశాలు ఇచ్చారు.ప్రత్యేక పరిస్థితుల్లో ఏపీ ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారని.. ప్రజల ఆంక్షలు, ఆకాంక్షలకు అనుగుణంగా నడుచుకుందామని పిలుపునిచ్చారు. కూటమికి తలవొంపులు తెచ్చేలా ఎవరు వ్యవహరించవద్దని విజ్ఞప్తి చేశారు.డిప్యూటీ సీఎం పవన్ సైతం మనపై ప్రజలు ఎంతో నమ్మకంతో ఉన్నారని.. ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఉందామని ఎమ్మెల్యేలకు సూచించారు. తాను తప్పు చేసిన చర్యలు తీసుకోవాలని సభాముఖంగానే కోరారు పవన్ కళ్యాణ్.అయితే కొంతమంది ఎమ్మెల్యేలు,మంత్రుల వ్యవహార శైలి భిన్నంగా ఉంటోంది. వారి కుటుంబ సభ్యులు సైతం దూకుడుగా వ్యవహరిస్తున్నారు. దీంతో కూటమి ప్రభుత్వానికి తల వంపులు తప్పేలా లేవు. అనంతపురం జిల్లాకు చెందిన ఓ మంత్రి భార్య అయితే.. తనకు ఎస్కార్ట్ పోలీసుల వాహనం కావాలని పట్టు పట్టారు.పోలీసులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో పెద్ద వివాదమే నడిచింది. సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.సీఎం చంద్రబాబు వరకు వెళ్లడంతో ఆయన మందలించారు. మరోసారి ఆ ఘటన పునరావృత్తం కాకూడదని ఆదేశాలు ఇచ్చారు. దానిపై సదరు మంత్రి సంజాయిషీ ఇచ్చారు. మరోసారి అలా జరగకుండా చూసుకుంటానని చెప్పుకొచ్చారు.నిన్నటికి నిన్న శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఏకంగా మీడియానే బెదిరించారు. టిడిపికి అనుకూల మీడియా గా ఉండే ఈనాడు విలేఖరికి ఫోన్లో తీవ్రస్థాయిలో హెచ్చరికలు పంపారు.ఇసుక మాఫియా వార్తలు రాయడమే ఇందుకు కారణం. అయితే దీనిపై ఈనాడు సమగ్ర కథనం రాసింది. బొజ్జల సుధీర్ రెడ్డిని తప్పుపడుతూ రాసిన ఈ కథనం పై సీఎం చంద్రబాబు స్పందించారు.ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి నుంచి వివరణ కోరినట్లు తెలుస్తోంది. అయితే ఏకంగా టిడిపికి అనుకూలంగా ఉండే మీడియాని బెదిరించడం రాష్ట్రంలో హాట్ టాపిక్ గా మారింది.తాజాగా గుంటూరు వెస్ట్ ఎమ్మెల్యే మాధవి భర్త రామచంద్రరావు పై ఒక వ్యక్తి ఫిర్యాదు చేశారు.నా భార్య ఎమ్మెల్యే.. నేను కోరినట్లుగా నాలుగు ఎకరాలు 30 లక్షల రూపాయలకు అమ్మేయ్. లేకుంటే తరువాత పరిణామాలు సీరియస్ గా ఉంటాయి అంటూ ఆయన హెచ్చరించారని బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఎమ్మెల్యే భర్త నుంచి తనకు ప్రాణ రక్షణ కల్పించాలంటూ ఫిర్యాదు చేయడం టిడిపి వర్గాల్లో కొత్త చర్చకు దారితీసింది. గతంలో రామచంద్రరావుకు కొంత మొత్తం భూమి అమ్మానని.. ఇప్పుడు మిగతా భూమిని కూడా అమ్మకం చేయాలని బలవంతం పెడుతున్నట్లు బాధితుడు చెబుతున్నాడు. అందుకే పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పుకొస్తున్నాడు.అయితే జనసేన తో పాటు బిజెపి ఎమ్మెల్యేలు జాగ్రత్తగా ఉన్నారు. కానీ టిడిపి మంత్రులు, ఎమ్మెల్యేల వ్యవహార శైలి ఇప్పుడు బయటపడుతోంది. ఒకవైపు సీఎం చంద్రబాబు జాగ్రత్తగా అడుగులు వేస్తున్నారు. రాజకీయ ప్రత్యర్థులు పొంచి ఉండడంతో నిర్ణయాల్లో జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కానీ సొంత పార్టీ ఎమ్మెల్యేలు, వారి కుటుంబ సభ్యుల వ్యవహార శైలి చిక్కులు తెచ్చి పెట్టేలా కనిపిస్తోంది. మరి చంద్రబాబు వారిని ఎలా అదుపులో పెట్టుకుంటారో చూడాలి.

## నన్ను తీసుకుంటే రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకి టైటిల్ తీసుకొస్తా: 6 సిక్సర్ల వీరుడు



ఐపీఎల్ లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు టైటిల్ గెలవాలనే కల కొనసాగుతూనే ఉంది. సీజన్ ప్రారంభంలో టైటిల్ ఫేవరేట్ గా బరిలోకి దిగడం.. అంచానాలు అందుకోలేక బోల్తా పడడం ఆ జట్టుకు అలవాటుగా మారింది. డివిలియర్స్, కోహ్లీ, గేల్, వాట్సన్, రాహుల్, చాహల్ లాంటి ఆటగాళ్లు ఆ జట్టులో ఉన్నా టైటిల్ అందించలేకపోయారు. కనీసం వచ్చే సీజన్ లోనైనా ఆర్సీబీ కప్ గెలవాలని ఫ్యాన్స్ ఎదురు ఎదురు చూస్తున్నారు. ఈ దశలో ఒక యువ క్రికెటర్ బెంగళూరుకు టైటిల్ అందిస్తానని ధీమా వ్యక్తం చేశాడు.
ప్రియాంష్ ఆర్య.. ప్రస్తుతం ఈ పేరు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతుంది. ఢిల్లీ ప్రీమియర్ లీగ్ లో అలవోకగా 6 బంతుల్లో 6 సిక్సర్లు బాదేశాడు. దీంతో భారత క్రికెట్ లో యువరాజ్ సింగ్ తర్వాత ఆరు బంతులకు ఆరు సిక్సర్ల కొట్టిన ప్లేయర్ గా చరిత్ర సృష్టించాడు. ఈ మ్యాచ్ లో మొత్తం 39 బంతుల్లోనే సెంచరీ చేసుకున్న ప్రియాంష్.. 50 బంతుల్లో 120 పరుగులు చేసి ఔటయ్యాడు. ఈ ఇన్నింగ్స్ అనంతరం ప్రియాంష్ తాను ఐపీఎల్ ఆడాలనుకున్నట్లు తన మనసులోని మాట చెప్పుకొచ్చాడు.
స్పోర్ట్స్‌యారీతో చాట్‌లో ప్రియాంష్ ఆర్య మాట్లాడుతూ.. “రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరపున ఆడాలనుకుంటున్నా. విరాట్ కోహ్లీ నా అభిమాన క్రికెటర్. ఆర్సీబీ ఇంకా ఐపీఎల్ ట్రోఫీని గెలవలేదు. నేను బెంగళూరు జట్టుకు వస్తే వారు టైటిల్ గెలవడానికి సహాయం చేస్తా”. అని ఈ యువ క్రికెటర్ తన మనసులోని మాటను బయట పెట్టాడు. ప్రియాంష్ ఆర్య ఐపీఎల్ ఆక్షన్ లోకి వస్తే అతన్ని చాలా జట్లు కొనడానికి సిద్ధంగా ఉన్నట్టు సమాచారం.

# గిల్‌క్రిస్ట్‌తో పోల్చినందుకు సంతోషంగా ఉంది:





రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు వికెట్ కీపర్ బ్యాటర్ అనుజ్ రావత్ ఢిల్లీ ప్రీమియర్ లీగ్ లో దంచి కొడుతున్నాడు. ఈస్ట్ ఢిల్లీ జట్టు తరపున ఆడుతున్న రావత్.. ఓల్డ్ ఢిల్లీపై మెరుపు సెంచరీ చేశాడు. 66 బంతుల్లోనే 6 ఫోర్లు, 11 సిక్సర్లతో 121 పరుగులు చేసి విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడాడు. రావత్ ఆడిన ఈ ఇన్నింగ్స్ పై ప్రశంసలు వర్షం కురుస్తుంది. ఇతడిని ఏకంగా ఆస్ట్రేలియా దిగ్గజ వికెట్ కీపర్ బ్యాటర్ ఆడమ్ గిల్‌క్రిస్ట్ తో పోలుస్తున్నారు. ఈ పోలికపై రావత్ తాజాగా స్పందించాడు. ఆస్ట్రేలియా దిగ్గజ వికెట్ కీపర్-బ్యాట్స్‌మెన్ ఆడమ్ గిల్‌క్రిస్ట్ తో తనను పోల్చడం గౌరవంగా భావిస్తున్నానని రావత్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో అన్నాడు. “నేను గిల్‌క్రిస్ట్ కు పెద్ద అభిమానిని. అభిమానులు నన్ను గుర్గావ్‌కి చెందిన గిల్‌క్రిస్ట్ అని పిలుస్తారు. ఇది నాకు గౌరవం”. అని రావత్ అన్నాడు. ఆస్ట్రేలియా తరపున వికెట్ కీపర్ బ్యాటర్ గిల్‌క్రిస్ట్ తనదైన ముద్ర వేశాడు. ఓపెనర్ గా వచ్చి విధ్వంసకర ఇన్నింగ్స్ లు ఆడడంతో పాటు.. వికెట్ కీపింగ్ లో అత్యున్నత ప్రదర్శన ఇచ్చేవాడు. ఢిల్లీ ప్రీమియర్ లీగ్‌లో అదరగొడుతున్న అనుజ్ రావత్ ఐపీఎల్ ద్వారానే ప్రపంచానికి తెలిశాడు. ఐపీఎల్ లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరపున కొన్ని కీలక ఇన్నింగ్స్ లు ఆడి అందరి దృష్టిలో పడ్డాడు. 2024 ఐపీఎల్ సీజన్ లో 5 మ్యాచ్‌లలో కేవలం 98 పరుగులు చేసి నిరాశ పరిచాడు. ఐపీఎల్ 2025 లో ఆర్సీబీ తరపున ఆడే అవకాశాలు తక్కువగా కనిపిస్తున్నాయి. అతన్ని 2024 ఐపీఎల్ మెగా ఆక్షన్ లోకి అవకాశముంది.

# రెండు ఇన్నింగ్స్‌ల్లో సెంచరీలు.. లారా, గవాస్కర్ సరసన రూట్



ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ జో రూట్ టెస్టుల్లో టాప్ ఫామ్ తో దూసుకెళ్తున్నాడు. కొడితే కొట్టాలిరా సెంచరీ అన్నట్టుగా రూట్ విధ్వంసం కొనసాగుతుంది. లార్డ్స్ వేదికగా శ్రీలంకతో గురువారం (ఆగస్టు 29) మొదలైన రెండో టెస్ట్ తొలి ఇన్నింగ్స్ లో భారీ సెంచరీతో కెరీర్ లో 33 వ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. అదే ఫామ్ ను కొనసాగుతూ రెండో ఇన్నింగ్స్ లోనూ సెంచరీతో మెరిశాడు. రూట్ టెస్ట్ కెరీర్ లో ఇది 34 వ సెంచరీ కావడం విశేషం. ఈ సెంచరీతో ఇంగ్లాండ్ తరపున అత్యధిక సెంచరీలు చేసిన ఆటగాడిగా అలెస్టర్ కుక్ 33 సెంచరీల రికార్డ్ ను రూట్ బ్రేక్ చేశాడు.
ఈ సెంచరీకి మరో స్పెషాలిటీ ఉంది. 34 సెంచరీలతో నలుగురు దిగ్గజ ఆటగాళ్ల సరసన రూట్ చేరాడు. గవాస్కర్, బ్రియాన్ లారా, యూనిస్ ఖాన్, మహేళ జయవర్ధనే తమ టెస్ట్ కెరీర్ లో 34 సెంచరీలు చేశారు. త్వరలో రూట్ ఈ రికార్డ్ దాటడం ఖాయంగా కనిపిస్తుంది. రాహుల్ ద్రవిడ్ (36), సంగక్కర(38), రికీ పాంటింగ్ (41), కల్లిస్ (45), సచిన్ (51) మాత్రమే రూట్ కంటే ముందున్నారు. లార్డ్స్ లో రెండు ఇన్నింగ్స్ లో సెంచరీ కొట్టిన నాలుగో ప్లేయర్ గా రూట్ రికార్డులకెక్కాడు. రూట్ మరో 96 పరుగులు చేస్తే ఇంగ్లాండ్ తరపున టెస్టుల్లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా చరిత్ర సృష్టిస్తాడు. రూట్ సెంచరీతో పాటు.. గస్ అట్కిన్సన్ ఆల్ రౌండ్ షో తో రెండో టెస్టులో ఇంగ్లండ్ 190 రన్స్ తేడాతో ఘన విజయం సాధించింది. దాంతో మూడు టెస్టుల సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలుండగానే 2%-%0తో సొంతం చేసుకుంది. నాలుగో రోజు ఆదివారం ఇంగ్లండ్ ఇచ్చిన 483 రన్స్ టార్గెట్ ఛేజింగ్‌లో లంక 292 రన్స్‌కే కుప్పకూలింది. ఇంగ్లండ్ బౌలర్లలో ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ గస్ అట్కిన్సన్ ఐదు వికెట్లు పడగొట్టాడు. మూడో చివరి టెస్టు ఈ నెల 6 నుంచి జరుగుతుంది.

# కుర్చీలో యాబ్ వర్కౌట్ కాకపుట్టించేలా!



ప్రగ్యా జైస్వాల్ డ్రెస్ మీరు ఆమె శైలిని దొంగిలించాలని కోరుకునేలా చేస్తుంది



ఆదాశర్మ ఇప్పుడేం చేసినా? సంథింగ్ స్పెషల్ గా ఫోకస్ అవుతుంది. సినిమాలైనా..నెట్టింట షేర్ చేసినా ఫోటోలైనా? సరే సంథింగ్ డిఫరెంట్ గా ట్రై చేస్తుంది. ఫోటో సెషన్లతోనే తనకొచ్చిన కళల్ని సైతం హైలైట్ చేస్తుంది. రోటీన్ కి భిన్నమైన ఫోజులతో యువతని ఆకర్షిస్తుంది. ఆ మధ్య తనలో కర్ర సాము..కత్తి స్వామి క్వాలిటీని తెరపై కి తెచ్చింది. చైనా భామలా కత్తి పట్టి? తనలో నైపుణ్యాన్ని అందమైన ఫోటోలతో చాటి చెప్పింది.
కుర్చిలో పడుకుని రెండు కాళ్లను హ్యాండిల్ సపోర్ట్ తో కిందకు వేసి..తలని ఆపోజిట్ హ్యాండిల్స్ పై పెట్టి ఎత్తైన పొట్టను లోపలికి లాగి వెనుక వెన్నుముఖకి తగిలేంతగా శ్వాసతీసుకుని బిగపబట్టింది. ఇదంతా ఫోటో సెషన్ లో భాగంగానే ట్రై చేసింది. కానీ నెటిజనుల్ని సంథింగ్ స్పెషల్ గా ఆకట్టుకుంటుంది. బిర్సా ముండా జీవితకథతో పా.రంజిత్ రెడీ అండ్ గ్రీన్ కలర్ కాంబినేషన్ దుస్తుల్లో అమ్మడి స్కిన్ టోన్ అంతే అందంగా ఫోకస్ అవుతుంది. వివిధ భంగిమల్లో కెమారాకి ఫోజులిచ్చింది. ప్రస్తుతం ఆ ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. అన్నింటిని మించి యాబ్ వర్కౌట్ భంగిమ కుర్రాకారుని ఆకర్షిస్తుంది. ఇక సినిమాల విషయానికి వస్తే ప్రస్తుతం అమ్మడి కెరీర్ బాగానే సాగుతుంది. %-%ది కేరళ స్టోరీ%-% తో పాన్ ఇండియాలో వచ్చిన గుర్తింపు తో హిందీలో కూడా అవకాశాలు వస్తున్నాయి. కెరీర్ ముగిసిపోయిందనుకుంటోన్న సమయంలో అవకాశాలతో అందర్నీ సర్ ప్రైజ్ చేస్తుంది. ఓ రకంగా తొలి ఇన్నింగ్స్ కంటే రెండవ ఇన్నింగ్స్ లోనూ కెరీర్ అనే ఆటను అమ్మడు రక్తి కట్టిస్తుంది అనొచ్చు.



తాజా స్నాప్‌లలో వాణి కపూర్ సొగసైన గ్రేస్

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com